
రాం.పం

# రమణి నిను పిలిచిందిరా !

చాలా అందమైన పూలతోట.

ఆ తోటలో.... ఒక చలువరాతి తిన్నె మీద కూర్చున్నాడు అతను - మదన గోపాలుడు.

అతని దృష్టి ఎటో వుంది.

ఆలోచన ఎక్కడో వుంది.

ఉదయం నించీ యిప్పటి దాకా అతనికి గతరాత్రి జరిగిన సంఘటనే గుర్తుకొస్తూ వుంది. గుర్తొచ్చే కొద్దీ గుండెల్లో ఏదో తెలియని తీపిబాధ. మదన మధన వేదన.

'మదన గోపాలా!'

ఆ పిలుపుకి ఉలికి పడ్డాడు.

చప్పున తలతిప్పి చూస్తే...ఎదురుగా చెలికత్తె

'రమణి రాయబారం పంపిందా? అనుకున్నాడు. 'హు' అనుకున్నాడు మళ్లీ. ముఖం తిప్పుకున్నాడు.

'తమరిలా అలకతో బిగిసి కూచోవడం ఏమీ బాగా లేదు' అంది మెల్లిగా

'ఎందుకని?' ఠపీమని ప్రశ్నించాడు.

'అమ్మగారు చింతతో వేగుతున్నారు. ఒంటరిగా వుందని మారుడు మర్మాఘాతంగా విరిశరాలు విసుర్తున్నాడు. క్షణక్షణం నిన్ను బాసిన వ్యథ పీడిస్తోంది. రమణి నిను పిలిచిందా .....రా....'

దానికి మదన గోపాలుడు ఊ అనలేదు ఆ అనలేదు.

'ఎందుకీ పట్టుదల స్వామీ!.... ఆమె అమాయకురాలు గోల...బాల.....నీకై మరులు చెందిన చాన! దయచూడు స్వామీ! ఆమె రా రమ్మని పిలిచింది! రా!'

'........................'

'పోవద్దని ఎవతె అయినా నేర్పిందా ఏమిటి స్వామీ?'

అదొకటా అన్నట్టు చూశాడు. అదేం లేదన్నట్టుగా పెదవి విరిచాడు.

'ఎవరు నేర్పిన బుద్ధులో ఇవి! లేకపోతే మరుబంతిలా మదమెక్కిన

దంతిలా నిన్నే తలచి తలచి విరహంతో వేగే చెలిని వదలి వస్తావా స్వామీ!'

'.................'

'ఈ విధంగా పంతం కూడదు. మన్మధ వేదనకు మా చెలిని గురి చేశావు. చెలి కామ శరఘాతానికి తాళలేదు. నువ్వు రావాలి. తాపం తీర్చాలి.'

'ఓహో! అలిగినప్పుడేమయింది యీ ఆలోచన. నేను రాకున్నా నేను లేకున్నా పరవాలేదన్నట్టు ప్రవర్తించిందే?' మదిలోని భావాన్ని మాటల్లో కాకుండా కనుబొమ్మల కదలికతో కనుల మెదలికతో ప్రకటించాడు.

'అవ్వ!' ఎంత నింద? ఎప్పుడైనా అలిగిందా! కలలో అయినా నిన్ను ఎడబాసిందా? ఇంత మలకనాగా చూడొచ్చా? పట్టుదల వద్దు. నీకై ఎదురు చూసి ఎదురు చూసి సొమ్మసిల్లి పోయింది. రా! వచ్చి వలపుతో ముంచెత్తు! మన్మధ యజ్ఞానికి సర్వం సమాయత్తమై వుంది...వచ్చి గ్రహించి అనుగ్రహించు....'

ఊఁ అనలేదు

ఊహుఁ అనీ అనలేదు.

'నీ కోసం మల్లె మొగ్గలు కోసింది. వాటిని దండలుగా కట్టింది. నువ్వొస్తే నీ మెడలో అలంకరిస్తుంది. మంచం చుట్టూ పందిరికీ హారాలుగా వేలాడదీస్తుంది. పాన్పు విరిపాన్పులా అలంకరించి నిన్ను అలరిస్తుంది. పరచిన మల్లెలు వాడేలా విరిసిన మొగ్గలు మురిసేలా ఆ విరి శయ్యపై విరులావిరులై విరహమావిరి అయ్యేలా చెలితో క్రీడించు ఎత్తుకు పై ఎత్తులా ఆవిడ మత్తిల్లేలా ఎదురొత్తుల వత్తిగిలేలా చెయ్యి!'

ఆ మాటలు ఆమె నిమ్మది నెమ్మదిగా ఆగుతూ ఆగుతూ ఉదాత్తానుదాత్త స్వరంతో మన్మధ వేదంలా పలికింది.

అవి ఏవేవో మధురోహలను కదిలించాయి.

గతంలో మమేకంగా అనుభవించిన అనుభవాల భావాల అనుభూతులు మరుభూతాలయ్యాయి.

గుండెని వూపేశాయి.

ఆనాటి అందాల పొందుల విందులు మనోవేదిక మీద తాండవించాయి. ఆమె అందం; అనుభవయోగ్యమైన యవ్వన సంపద, ఆమె అనురాగ పరాగం అన్నిటిని మించి తన్నధిగమించి మించి క్రీడించిన చినదాని ప్రగల్భం....

ఓహ్....ఇప్పుడు యీ క్షణమే అక్కడ వాలాలనిపించింది. కానీ ఆమె ఎత్తి పొడుపులు గుర్తొచ్చి....మనసాగిపోయింది.

'ప్రభూ!....'

తానే తప్పు చేశానా? తానేం తప్పు చేశానా? అని మాటి మాటికి కన్నీరు మున్నీరుగా దుఃఖిస్తోంది. పన్నీటితో మేలమాడవలసిన మేను కన్నీటి మున్నీట మునగడమా?

క్షణం ఆగింది.

ఆయన మనస్సులో ఏదో సొద...తీయని రొద.

'మదన గోపాలా! ఏమిటి యీ నిర్దయ? విరహ వేదన మేర మీరింది. భ్రమతో అన్ని దిక్కులూ నీవు వస్తావని ఎదురు చూస్తోంది. అసలు నువ్వు రావేమో అనే అనుమానమే లేదు. ఎలొస్తావో ఎప్పుడొస్తావో అని ఎదురు తెన్నులు చూస్తోంది. ఇది నీకు ధర్మం కాదు. అబలను, ఏకాకిని, విరహిణిని అలా మన్మథాగ్నిలో పడెయ్యడం పాడికాదు....!

మళ్లీ ఒక క్షణం ఆగింది.

'ప్రభూ! సయ్యాటల్లో సమయం గడపాలి. సాధింపుల్లో వేధింపుల్లో కాదు. ముచ్చట్లతో ముద్దులతో మురిపాలు తీరాలి. దయచూడు! దరిచేరు! దరిలేని ఆనందాలు చవిచూడు'

మరుక్కున చూశాడు.

ఆయన చూపుల్లో....

"ఆమె కంటే నీకే ఆరాటం ఎక్కువగా వున్నట్టుందే. విసిరి కొట్టినప్పుడు ఈ విరహమేమయింది. ఛీ కొట్టినపుడు ఈ చిత్రమేమయింది? చెక్కిలిపై చేయివేస్తే చికాకు పడింది. జడ ముట్టుకుంటే విదిలించుకుంది. పెదవి అందుకోబోతే ముఖం తిప్పుకుంది. కౌగిలించబోతే కసిరి కొట్టింది. మగాడు లేందే బతగ్గలననుకుందా? ఒక్కతే విరిశయ్య మీద నిదురిద్దామనుకుందా?"

యిన్ని మరిన్ని భావాలు ప్రతిబింబించాయి

'ఆటల్లో మాటలు పట్టించుకోవచ్చా? ఏదో అన్నది..... చిన్నది కదా! చిత్తజుడి బారికి ఎలా నెగ్గుక రాగలదు. తోడుకోరే ఈడుతో ఎలా నిలవగలదు?'

'ఆగి మళ్లీ అది గడియే యుగమై యుగమే బరువై నీ కోసం తలపోతల్లో కాలం సాగిస్తోంది...

ఆ క్షణంలో అలా మూసిన కళ్లను, అదిరిన చెక్కిళ్లను.... చాచితే సాగిన చేతిని..... విసిరితే తిరిగిన జడను, కోపానుగుణంగా పటపటలాడిన పలువరుసను పలుమారులు నిందిస్తోంది. అంతా తన కర్మ అని నిందించుకుంటోంది. వేడిగా కాసే చంద్రుడ్ని తిడుతూ కౌగిలిలోకి తీసుకోని నీకై చేతులు చాస్తోంది.

నువ్వొస్తావని వగతీరుస్తావని ఎదురుచూస్తోంది. ఇక తాళలేదు. రా! నా పిలుపే తన ఆహ్వానంగా నా నివేదనే తన ఆవేదనగా నా వేడికోలే తన విన్నపాలుగా భావించు.. వనిత మనస్సు తెలుసుకో.. అలా మసలుకో..."

పెదవి విరిచాడు "కింద పొగలల్లా సెగలైతేనే పాలు పొంగేది. ఇంకా మరులు సెగల్లో మానిని వేగనీ! అప్పుడే కదా మురిపాలు సగబాలయ్యేది" అనుకున్నాడు.

'ప్రభూ! మన్మధ వేదనకి తాళలేదు.. ఏ బాధ అయినా భరించవచ్చు. ఉపశమనానికి మందులున్నాయి, మాకులున్నాయి కానీ యీ వలపు రోగానికి మందుల్లేవు. శైత్యం కావాలని పన్నీరు చల్లితే విరహం సెగలు పొగలు చిమ్ముతుంది.

కాక తగ్గాలని గంధం పూస్తే వలపు వేడికి వలపు గంధం వేడెక్కి వాడెక్కుతుంది. చల్లని వని పూలపాన్పుపై పవళింప చేస్తే అవి బాకులవుతాయి. మన్మధుడి బాణాల ములుకులవుతాయి దీనికంతటికీ ఒక్కటే మందు!

నీ కౌగిలి! నీ తీయని ముద్దు! సడిసేయని, సడలిపోని బిగికౌగిలి! నీ బిగికౌగిలిలో నరనరాలూ జివ్వుమనేలా నువ్వందించే అధరామృతం. ఆపై తామరతూడుకు ఎడమీయని అలుకతీర్చే కలయిక"

ఒక్కోమాట ఒక్కోపూల బాణమైంది. రవికిరణాలకు కరిగే మంచుగడ్డలా బిగువు తరిగిపోతోంది. కానీ గతరాత్రి ఆమె పలికిన ములుకుల్లాంటి పలుకులు!

చెల్లెబో పసుపంటినది నీ జిలుగు దుప్పటి విప్పరా
ముల్లుమోవగ సందు లేదుర మోవికెంపులు గప్పరా
తెల్ల వారిన వాక ఎక్కడ తిరుగులాడితి చెప్పరా
కల్లలాడ... క......

ఎంత మాటంది!

మాట విరిచి కల్లలాడ అంటూనే కల్లలాడక అని సరిపుచ్చింది.

ఆడేవాడికి పాడేవాడికి అబద్దాలడందే ఎలా గడుస్తుంది? పదారువేలపై చిలుకు పడతుల్లో తానొక్కతి! వేయార్ల యిళ్ల పూజారి తను! తన కొక్కతికే తాను సొంతమైనట్టు.. తనని తప్ప మరొకర్ని కన్నెత్తి చూడరాదు, పన్నెత్తి

పలుకరించరాదంటే ఎల్లా చెల్లుతుంది?'

"ప్రభూ! దాసుల తప్పులు దండంతో సరి! చేతులొగ్గి విన్నవించింది. తను వొగ్గి దాసోహమంది! రసస్వామి రసమయలోకాలు ఏలుకో! శతకోటి తప్పులైనా ఒక్క చరణారవింద నమస్కారంతో చెల్లు... రా... రమణి నిను పిలిచింది రా!"

అప్పుడు ప్రసన్నుడై లేచాడు.

ఆ ఇంతి యింటిదారి పట్టాడు.

(కందుకూరి జనార్దనాష్టకంలోని ఓ పద్యానికి పదకల్పన)

* * *